# పెళ్లి

కూతురు పెళ్ళి చేయాల్సొచ్చేసరికి ఒక్క పెట్టున యిన్ని సమస్య లెదురవుతాయని శాంతమ్మ వూహించనైనా లేదు. కూతురు పెళ్ళి విషయంలో తను ఏ ఆశలు పెట్టుకున్నదో—అవి అక్షరాలా జరిగితీరతాయి అనుకున్నది.

నిజానికి నిర్మల శాంతమ్మకి ఒక్కగానొక్క కూతురు. ఆ కూతురయినా అనాకారి కాదు. అందంగా వున్నదే. దానికితోడు పి. యు. సి. చదువుకుంటున్నది. చేతిలో పెద్దగా డబ్బూ దస్కమూ లేకపోయినా తన అనంతరం కూతురుకు చెందడానికి పదెకరాల పొలం వున్నది.

మొత్తానికి ఆవిడకు కూతురు పెళ్ళి తలలో పురుగులా తొలచ లేదు. ఆవిడ నిశ్చింతగానే వున్నది. ఎవరైనా పెళ్ళి ప్రసక్తి తెస్తే "ఆ దాందేముందిలెద్దూ. ఆ ఘడియవస్తే అదే అవుతుంది" అని తాత్సారంగా అనేది.

ప్రసక్తి తెచ్చినవాళ్ళకి – శాంతమ్మ తాత్సారం వెనకవున్న ధీమా – తెలియందికాదు.

"అవునమ్మా! నీకేం, వూర్లోనేమో పిల్లకి మేనత్త కొడు కున్నాడు. పుట్టింటనేమో తమ్ముడున్నాడు. ఎవరి కిష్టపడితే వారికి కట్టపెట్టవచ్చు. సంబంధాలు వెతికే పనిలేదు" అనేవారు. శాంతమ్మ మనసులో ఏమున్నదో ఎవరికీ తెలీదుకాని, కూతుర్ని వూర్లోనే యిస్తుందని అంతా అనుకున్నారు.

అట్లా అనుకునేందుకు కారణాలు వున్నవి. నిర్మల రెండేళ్ళ పిల్లగా వున్నపుడు భర్త పోయాడు.

ఆ వూళ్ళో వెనకా ముందు ఎవరు లేని శాంతమ్మను - ఆడ బిడ్డ భర్త రామనాథం ఆదుకొని మంచిచెడ్డలు చూస్తున్నాడు. రామనాథమైనా - మంచిచెడ్డలు చూశాడంటే - నిర్మలని తన కొడుక్కి చేసుకుందామన్న ఉద్దేశ్యంతోనే. శాంతమ్మ పదెకరాలు ఆవిడ అనంతరం - పరాయివాడికి చెందడం - రామనాథానికి యిష్టంలేదు.

రెండు కుటుంబాలకీ వున్న అన్యోన్యతని చూచి - నిర్మలని - రామనాథం కొడుకు - రాజారావునీ - మొగుడూ పెళ్ళాలకిందే జమకట్టారు.

మొత్తానికి శాంతమ్మ జాగర్త మనిషి. మనసులోవున్న మర్మం ఆవిడ ఎప్పుడూ బయటపెట్టలేదు. రాజారావు బి. ఎ. పాసయి, బి.ఇడి.కి వెళ్ళగానే - "బడిపంతులుకు భస్తే నాకూతుర్ని ఇవ్వను" అనుకున్నది. అల్లుడంటే కూతుర్ని కార్లో తిప్పగలవాడుగానే-ఆవిడ కళ్ళల్లో మెదుల్తున్నాడు.

కార్లో తిప్పగలవానికోసం చూచినపుడు - మెడిసన్ చదువుతున్న తమ్ముడిమీద దృష్టి పడింది. వున్న ఆస్థికి వారసుడు వాడొక్కడే - తన్ను కాదని ఎక్కడికి పోతాడనే ధీమా శాంతమ్మకు మొదట్నుంచీ వున్నది.

పెళ్ళి సమస్య - అంటూ బయటకు రానంతవరకూ ఆవిడ నిశ్చింతగానే వున్నది. తీరా వచ్చిన తర్వాత ఆవిడ పడ్డ యాతన అంతా ఇంతా కాదు.

మొట్టమొదట ఆవిడను ఎదుర్కొన్న సమస్య వూళ్లో వున్న సంబంధం. దాన్ని వదలించుకోవడం బ్రహ్మప్రళయమయింది.

"ఏమమ్మా వదినా! మా కోడలికి సెలవు ఎప్పుడు?" అన్నది ఆడబడుచు ఒకరోజు యింటికివచ్చి.

బడిపంతుల్ని కన్నతల్లి, తన కూతుర్ని పట్టుకొని కోడలని పిలవడం శాంతమ్మకు నచ్చలేదు. ఇన్నాళ్ళూ నచ్చిందంటే అది వేరే విషయం.

శాంతమ్మ కూతురు సెలవు విషయం చెప్పలేదు.

"అది ఏయింటి కోడలు కావాలని రాసివుందో ఆ భగవంతుడికి తెలుసు. మనం కర్తలమా రాధమ్మా!" అంటూ వేదాంతం వల్లించింది.

ఈ వేదాంతం వినగానే రాధమ్మ షాక్ తింది.

"ఏమిటొదినా రాతలూ, గీతలూ అంటున్నావు. తప్పించుకుందామనుకుంటున్నావా?" అన్నది షాక్‌నుంచి తేరుకొని.

"తప్పించుకుంటేమట్టుకు నీకు వచ్చిన నష్టమేముంది? కొడుకును గన్న తల్లివి. ఆ కొడుకైనా చదువుకున్నవాడాయె, కోడలు దొరక్కపోతుందా?" అంటూ లేనిపని కల్పించుకుని వెళ్ళిపోయింది. ఇంతటితో ఈ ప్రసక్తి ఆగిపోతుందనే అనుకున్నది శాంతమ్మ. అయితే ఆవిడ వూహ రైటుకాదు. ఆ రాత్రికే నలుగురు పెద్దమనుషులు వచ్చి యింట్లో కూచున్నారు.

"ఎందుకొచ్చామో తెలుసా శాంతమ్మా!" అన్నాడు ఒక పెద్దమనిషి ఉపోద్ఘాతంగా.

"చెప్పండి" అన్నది శాంతమ్మ గడపమీద కూచుని.

పెద్దమనుషులు గొంతులు పెద్దవిచేసి - ఒకరుమార్చి ఒకరు - శాంతమ్మ కూతుర్ని, రామనాథం కొడుక్కు యివ్వవలసిన అవసరం గూర్చి చెప్పారు. ఇన్నాళ్ళూ ఆశపెట్టి యిప్పుడు కాదనడం అన్యాయమన్నారు. అయిన సంబంధ మన్నారు. గడప దగ్గరికి వచ్చినదాన్ని కాలదన్నగూడదన్నారు. పెద్దలు చెప్పింది పెడచెవిని పెట్టకూడదన్నారు. ఒకటనికాదు - సవాలక్ష పాయింట్లు చూపారు. తీరా శోషపుట్టిన తర్వాత -

"మరి ఏమంటావు శాంతమ్మ" అన్నారు.

"మీకు తెలీందేముంది. అబ్బాయి చదువూ, ఆస్తిపాస్తులూ, అన్నీ అంతంతమాత్రమే. పాత బంధుత్వమంటున్నారు. బంగారు

కత్తి అని గొంతు కోసుకోమంటారా? దయచేసి నన్ను బలవంత పెట్టకండి" అని ఒక ముక్కలో కొట్టివేసింది. పెద్దమనుషులు ఓటమి ఒప్పుకోవడం యిష్టంలేక మరి కొంతసేపు బోధించారు. ఆ బోధన లేవీ ఆవిడ చెవికెక్కలేదు. జడ్జిమెంటు ముందే సిద్ధం చేసుకున్న జడ్జిముందు వకీలు వాదనలా నిరుపయోగమయ్యాయి.

తన్ను గురించి ఎవరేమనుకున్నా ఈ ఘట్టం యింతటితో ముగిసినందుకు శాంతమ్మ సంతోషించింది. ఎలాగూ పెళ్ళి ప్రసక్తి వచ్చింది గనక - తమ్ముడి విషయంకూడ తేల్చుకోవడం మంచిదిగా కనిపించింది.

కూతురు నిర్మల సెలవులకు యింటికిరాగానే "రేపు మీ తాతగారి వూరికి వెళ్ళాలి. బట్టలు సర్దుకో" అన్నది శాంతమ్మ.

"తాతగారి వూరికి నేనెందుకు? నువ్వు వెళ్ళు" అన్నది నిర్మల ముఖం చిట్లించి.

సెలవులకు యింటికి వచ్చినప్పటి నుంచి తల్లితో ఏం మాట్లాడినా కట్టె విరచినట్లు మాట్లాడుతున్నది.

శాంతమ్మకు వొళ్ళుమండింది. "అడ్డకూతలు కుయ్యకు, చెప్పినట్లు చెయ్యడం నేర్చుకో" అన్నది గొంతు సాధ్యమైనంత పెద్దదిచేసి.

నిర్మల గడుసు పిండమే కాని - తల్లి ధోరణి చూచాక ధైర్యం చాల్లేదు. తల్లి పిలవడంలోగల వుద్దేశం నిర్మలకు తెలుసు. నిర్మలకు రాజారావుకి ఎప్పుడో మనసులు కలిశాయి. కన్నెపిల్లలకుండే బెరుకు కొద్దీ, నిర్మల వాడిని వంటిమీద చెయ్యి వెయ్యనియ్యలేదు.

ఎలాగయితేనేం — నిర్మల తల్లివెంట తాతగారి వూరికి వెళ్ళక తప్పలేదు.

"ఏమిటే శాంతా - నిర్మలకు పెళ్ళిసంబంధాలు ఏమన్నా వస్తున్నాయా? లేక వూళ్ళోనే ఇచ్చెయ్యాలనుకున్నావా?" అన్నది తల్లి.

ఇంట్లో అడుగుపెట్టి గంటకాలేదు. తల్లి ఇట్లాంటి ప్రశ్న వేస్తుందని శాంతమ్మ వూహించలేదు. ఆ ప్రశ్న విని దిగ్భ్రాంతి చెందింది.

"అమ్మా ఇది మీకేమన్నా న్యాయంగా వుందా?" అన్నది శాంతమ్మ.

"ఏమిటి?" అన్నది ఏమీ ఎరగనట్టు తల్లి.

"నేను తమ్ముడి మీదే ఆశ పెట్టుకున్నాను. నీకైనా యిది పరాయి పిల్లకాదు. మనుమరాలు. పరాయిపిల్లను చేసుకుంటే పది వేలు ఎక్కువ రావచ్చు. అంతమాత్రాన ఐన సంబంధం వదులు కుంటారా?" అన్నది గుడ్లమీదికి నీళ్ళుతెచ్చుకుని.

"నాదేముందే? ఆర్చేదాన్నా, తీర్చేదాన్నా? మీ నాన్నని అడుగు" అన్నది.

"నీకే పట్టలేదు. ఇక నాన్నకి ఏం పట్టుతుంది. పరాయి సంబంధమైతే పాతిక వేలన్నా ముడుతాయని చూస్తున్నారు. అంతే అమ్మా కదా మీ ఆలోచన. డబ్బేకాని మీ కళ్ళకి–రక్తసంబంధాలు కనిపించడంలేదే" అంటూ శాంతమ్మ వలవల యేడ్చింది.

ఆమె ఏడ్పు తల్లిని కరిగించలేదు. తండ్రి దగ్గరికి వెళ్లి మొర పెట్టుకుంది. "నిర్మల మనసంతా వాడిమీదే వుంది. మీరు కాదంటే అది నుయ్యో గొయ్యో చూసుకుంటుంది" అన్నది.

ఇట్లాంటి మాటలు ఆ ముసలివాడి చెవికి ఎక్కనేలేదు. "వాడికి మంత్రుల సంబంధాలు వస్తున్నాయమ్మా, చుట్టరికాల పేరిట వాడి భవిష్యత్తు పాడుచేయకూడదు. నిర్మలకు మంచి సంబంధం నేను చూస్తానుగా" అన్నాడు.

లాభం లేదనుకున్న తర్వాత శాంతమ్మ కన్నీళ్ళాపి, నోటికి పనిచెప్పింది. ఇంతకింత చేశారు. ఇంకేం చెయ్యగలరు. అనుకున్న

తర్వాత శాంతమ్మకి ఎక్కడలేని ధైర్యం వచ్చింది. అమ్మనీ నాన్ననీ- తిట్టినతిట్టు తిట్టకుండా కసితీరా తిట్టి, ఆరోజే తిరుగుప్రయాణం కట్టింది.

నిర్మల తాతగారి వూరినుంచి వచ్చాక రాజారావు కలుసుకున్నాడు.

"ఊర్లో బావ చేదయ్యాడా? మెడిసిన్ మామకోసం పరుగెత్తావట?" అన్నాడు.

"నోరు మూసుకో, అమ్మ రమ్మంటే వెళ్ళాను. నువ్వు చేదని ఎవరన్నారు. యేడుస్తూ రైకముడి విప్పే బాపతు - ఆ మెడిసిన్ గాడు రుచి అని ఎవరన్నారు? అట్లాంటి వాళ్లకి - ఖర్మబాలని యే మంత్రుల కూతుళ్లో వుంటారు. నాకేం ఖర్మ" అన్నది.

"మరి గుళ్లో పెళ్ళా, రిజిష్టరు పెళ్ళా" అన్నాడు రాజారావు.

"ఎక్కడో యేం ఖర్మ, పందిట్లోనే చేసుకుందాం. కాస్త ఓపిక పట్టు" అన్నది.

సెలవులు కాగానే నిర్మల వెళ్ళిపోయింది. శాంతమ్మకి మట్టుకు మనసు కుదుటపడలేదు. ఊళ్లోవున్న సంబంధాన్ని – తను కాలదన్నింది. తన సంబంధాన్ని తండ్రి కాలదన్నాడు. రెంటికీ చెడ్డ రేవడిలాగా అయింది తన పని. ఇన్నాళ్లకిమల్లే – నిర్మల పెళ్లి విషయంలో తాత్సారం చెయ్యడానికిలేదు. తనేమో మొగదిక్కులేనిది. యేం చెయ్యడమా అన్న ఆలోచన ఆవిడ గుండెలమీద గుద్దుతూనే వుంది. సరిగ్గా ఈ సమయంలోనే మరో ఆటంబాంబు పేలింది. అది నిర్మల రాసిన వుత్తరం. వెళ్లి తీరా మరో వారం రోజులన్నా కాలేదు. ఎవర్నో ప్రేమించిందట. పెళ్లి చేసుకుంటాను అంటూ రాసింది.

ఉత్తరం చదవగానే, శాంతమ్మకి నెమ్ములు విరిగాయి. చేతులూ చల్లబడ్డాయి. ఒళ్ళు మండినమాటకూడా వాస్తవమే. కానీ మంట ఎవరిమీద చూపేటట్టు? కూతురు కళ్ళబడితే కాళ్ళూచేతులూ

విరబోలనిపించింది. శాంతమ్మకి ఆవేశమొచ్చింది. దుఃఖమొచ్చింది. తన కూతురు తన కడుపున పెడబుట్టింది. లేకపోతే ప్రేమేమిటి, పెళ్ళేమిటి? శాంతమ్మ కూతురు ఎవరితోనో లేచిపోయిందని–రేపటి నుంచి ఊరంతా కోడై కూస్తుంది. తను యే గంగలోనన్న దూకాలి? యేడుకొండలవాడా, ఎంత కష్టపెడుతున్నావయ్యా" అంటూ శాంతమ్మ గోడుగోడున యేడ్చింది. యేడ్చుకుంటూనే యేంచెయ్యడమా అని ఆలోచించింది. ఎంత ఆలోచించినా, గబిక్కిన నిర్మలను తెచ్చి వూర్లో సంబంధంతో ముడెయ్యడంకన్నా మంచి మార్గం కన్పించ లేదు. తనేమో మగదక్షత లేనిది. కొంపలంటుకుంటే బావి త్రవ్వి నట్లు యిప్పుడు వేరే సంబంధం వెదకడం అయ్యేపనికాదు.

తనతో అంత అవమానమూ పొంది తీరా యిప్పుడు వాళ్లు మట్టుకు నిర్మలను చేసుకోవడానికి యిష్టపడతారా అన్న ఆలోచనే శాంతమ్మకు రాలేదు. ఎందుకంటే వాళ్లు దాన్ని అవమానంకింద తీసుకోలేదని రూఢిగా శాంతమ్మకు తెలుసు. దానికి కారణముంది, వాళ్ళు యిప్పటికీ, తను వాళ్ళకి అన్యాయం చేసినట్టు నలుగురితోనూ చెప్పుకొని వాపోతున్నారు. అవమానం కిందనే దాన్ని వాళ్లు జమ కట్టివుంటే – నలుగురితోనూ అసలు – ఆ ప్రస్తావనే తీసుకురారు. ఆ అవమానాన్ని ఎవ్వరూ పదేపదే జ్ఞాపకం చేసుకోరు. గనక వీళ్లు నిర్మలను చేసుకోరు అన్నదానికి ఆస్కారంలేదు. ఎటొచ్చీ ఇప్పుడు తను చెయ్యవలసిన పని, నిర్మలని వున్నఫళాన అక్కడినుంచి తీసుకు రావాలి. యే కొంచెం ఆలస్యం జరిగినా పరిస్థితి చేయిదాటిపోవచ్చు. ఇట్లా ఆలోచించినాక శాంతమ్మ అప్పటికప్పుడే రాజారావును ఇంటికి పిలిపించింది. వాణ్ని కూచోబెట్టి పారం అప్పగించింది. "నాయనా రాజారావ్! నీతో ఒకమాట చెబుదామని పిలిచాను. యేంలేదు. నిర్మలని నీకిచ్చానని – అప్పుడేదో పొరపాటున నోరు జారాను. మనది రక్తసంబంధం. తెంపుకుంటే తెగేదా నాయనా? దానికైనా నీమీదే మనసు. మధ్యలో నేనెవత్తిని కాదనడానికి? ఈనెల్లోనే మీకిద్దరికి పెళ్ళిచేసి చేతులు కడుక్కుందాం అనుకుంటున్నాను.

మిగతా విషయాలు మీ నాన్నతో మాట్లాడతాను. నువెళ్లి నిర్మలని తీసుకురావాలి. ఈరోజే వెళ్లాలి"

"ఇప్పుడేం తొందరొచ్చిందత్తా. పరీక్ష అయిపోనీకూడదా?" అన్నాడు.

"నీకు తెలీదు నాయనా, అనుకున్నాక దేనికైనా ఆలస్యం పనికిరాదు. అయినా అది పరీక్షలు పాసయి ఉద్యోగాలు చెయ్యాలా, ఊళ్ళు యేలాలా, పెద్దదాన్ని చెబుతున్నాను. నువ్వు వెళ్ళు" అంటూ ఆదేశించింది.

రాజారావు తర్వాత నోరెత్తలేదు. అపుడే బయలుదేరాడు.

తిరుపతి చేరగానే లాడ్జింగులో దిగి ఫోను చేశాడు. "అక్కడికి రమ్మన్నావా? ఇక్కడికి వస్తావా?" అని.

"ఇక్కడ కుదరదులే! పర్మిషను తీసుకొని అక్కడికే వస్తున్నాను" అని ఫోను పెట్టేసింది.

మరోగంటకి లాడ్జికి వచ్చింది. వస్తూనే "కాయా? పండా?" అన్నది.

"పండే. పద. వూరికి పోదాం. మీ అమ్మ తొందరపడుతోంది" అన్నాడు.

"యేమో బాబూ, నాకు భయంగా వుంది. అమ్మ యేమంటుందో?" అని గునిగింది.

"నంగనాచి కబుర్లు చెప్పకు. నాకు మంటపుడుతుంది. నీకు భయమా? అసలు తాళిగట్టాక నాకైనా భయపడతావా అని? ఉండు నీపని చెబుతాను" అంటూ నిర్మలను డన్‌లప్ బెడ్‌మీదికి ఈడ్చాడు.

నిర్మల ఎప్పటిలాగా అడ్డుచెప్పలేదు.

— —